క్లుప్తంగా

విద్యార్థికి అభినందనలు



అభినందిస్తున్న డీపీవో వీర బుచ్చయ్య

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన రాచకొండ కౌశిక్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 562 మార్కులు సాధించాడు. జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఆదివారం కౌశిక్‌ను అభినందించారు. గుండారం గ్రామపంచాయతీలో కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న రాచకొండ భీమరాజు కుమారుడు కౌశిక్ మంథని బాలుర సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి చదివాడు.

డ్రగ్ ఫ్రీ కంట్రీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

రామగిరి: మండలంలోని నాగెపల్లి గ్రామంలో ఆదివారం విశ్వవిజ్ఞాన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద దుకాణ సముదాయాలకు కరపత్రాలను పంపిణీ చేశారు. పిల్లలు, యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులపై ఉందన్నారు. వ్యవస్థాపకులు మల్లారపు అరుణ్‌కుమార్, ఆర్గనైజర్ మల్లెపల్లి రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాజశేఖర్, మోహన్, సాయిరాంగౌడ్ పాల్గొన్నారు.

'ఖని'లో క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరం

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాలను గోదావరిఖనిలో ఈ నెల 7 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అధ్యక్ష, కార్యదర్శి వి.ఆగంరావు, ఎస్.మురళీధర్‌రావు, గోదావరిఖని క్యాంప్ ఇన్‌చార్జి డి.కిరణ్‌కుమార్ తెలిపారు. 13 నుంచి 23ఏళ్ల వయస్సు గల బాలురు, బాలికలు పాల్గొనాలని సూచించారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్, పాస్ ఫొటోతో ఎంట్రీ ఫాం జత చేయాలన్నారు. ఎంట్రీ ఫాం స్థానిక జీఎం కాలనీ పార్క్ ఎదుట గల కంప్యూటర్ ఆఫీసులో లభిస్తుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 6గంటల నుంచి 8 వరకు ఎంట్రీ ఫాం లభిస్తాయన్నారు. దరఖాస్తుకు ఈ నెల 6న ఆఖరి గడువు అని పేర్కొన్నారు. వివరాలకు కొరకు సెల్.9866351620 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వృద్ధాశ్రమంలో నవ్వుల దినోత్సవం



కామెడీ స్కిట్ చేస్తున్న స్మైల్ ప్లీజ్ సభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ: ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ సభ్యులు రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో ఆదివారం 'నవ్వుల నజరానా–హాస్యవల్లరి' నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మేజిక్ రాజా మాట్లాడుతూ కృత్రిమంగా కాసేపు నవ్వినా.. ఫీల్ గుడ్ హార్మోన్స్ బాడీలో రిలీజై మనిషి ఆరోగ్యంగా ఉంటాడని, 'నవ్వితే హ్యాపీ.. నవ్వకపోతే బీపీ' అని వైద్యులు సూచిస్తున్నారన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజల ఒత్తిడిని దూరం చేసి నవ్వులు పంచడానికి 2007, డిసెంబర్ 16న స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యులను సత్కరించి అభినందించారు. క్లబ్ సభ్యులు మేజిక్ రాజా, చంద్రపాల్, హరి ప్రదర్శించిన పలు కామెడీ స్కిట్లు, మేజిక్ రాజా మాట్లాడే బొమ్మ, హరి ఇంద్రజాల ప్రదర్శన వృద్ధులను విశేషంగా ఆకట్టుకుంది. స్పందించిన ఆశ్రమవాసి సకినాల రాజమౌళి సైతం తన జోక్స్‌తో అలరించారు. స్మైల్ ప్లీజ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేజిక్ రాజా, చంద్రపాల్, సభ్యులు, పాత్రికేయులు దయానంద్ గాంధీ, పొన్నం విజయ్ కుమార్‌గౌడ్, మేజిక్ హరి, మొగరం గట్టయ్య, వై.లెనిన్, ఆశ్రమ నిర్వాహకులు పీటి స్వామి, గంట సత్తయ్య, జూకా సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకట్‌గౌడ్, సీతారాంరెడ్డి, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరం సందర్శన

జూలపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.స్వర్ణలత సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు.

ఐదేళ్లుగా 'పది'లో వందశాతం ఫలితాలు

- ప్రతిభ కనబరుస్తున్న ఎల్లంపల్లి కేజీబీవీ విద్యార్థినులు



ఎల్లంపల్లి కస్తూరిబా విద్యాలయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి కస్తూరిబాగాంధీ విద్యాలయం విద్యార్థులు ఐదేళ్లుగా పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధిస్తున్నారు. 2020–21లో ఎల్లంపల్లి కేజీబీవీ ప్రారంభమైంది. విద్యాలయంలో 6వ తరగతి నుంచి పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులతో కలిపి మొత్తంగా 360 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన పి.అమూల్య 549మార్కులు, ఎస్.వినీల 540, వైష్ణవి 540, అనన్య539, కావేరి 539, ఆశ్రిత 538, యశస్వి 530మార్కులు సాధించారు.

ఐదేళ్లుగా నమోదైన ఫలితాలు..

2020–21లో 31మంది 'పది' పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

2021–22లో 39 మంది విద్యార్థులు..

2022–23లో 44 మంది విద్యార్థులు..

2023–24లో 43 మంది విద్యార్థులు..

2024–25లో 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

కేజీబీవీ విద్యాలయం ప్రత్యేకతలు..

- గ్రామీణ ప్రాంతంలో ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాలయం.
- ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి.
- చదువులో వెనుకబడిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు.
- విద్యార్థినుల అభిరుచులు, అభిప్రాయాలకు అనుగుణంగా ఆధునిక డిజిటల్ విద్యాబోధన.
- ఆటపాటలతో సబ్జెక్టును మరో అంశానికి అనుకరిస్తూ బోధించడంతో విద్యార్థినుల్లో ఆసక్తి.
- విద్యాలయంలో ఆధునిక పరిజ్ఞానానికి సంబంధించి, సామాజిక, ఆర్థికపరమైన అంశాలను తెలుసుకునేందుకు లైబ్రరీ ఏర్పాటు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



ప్రతీ స్టూడెంట్‌ను నా కూతురుగా భావిస్తాను. ముఖ్యంగా కేజీబీవీల్లో చదివించే పేరెంట్స్ అత్యధికంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారుంటారు. ప్రతీ విద్యార్థికి చదువు కష్టం కాకుండా ఇష్టమయ్యే రీతిలో వారి అభిరుచులకు అనుగుణంగా విద్యాబోధన చేస్తుంటాం. పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చాలనేదే నా కర్తవ్యం. అందుకే ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోనే వందశాతం ఫలితాలు సాధ్యమవుతున్నాయి.

– తౌటం కల్పన, ఎస్‌వో, ఎల్లంపల్లి కేజీబీవీ



ఓదెల: ఉపాధ్యాయులతో కొలనూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు



రామగిరి: చందనాపూర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఓదెల: మండలంలోని కొలనూర్ హైస్కూల్లో 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 ఏళ్లకు కలిశారు. కొలనూర్ హైస్కూల్ వేదికగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు కాలిక్, దికొండ పోచయ్య, గసిగంటి రమేశ్, స్వర్ణలత, పుష్పలతను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు కర్రె ప్రభాకర్ రెడ్డి, సిరికుట్ల సుమన్, జంగ కుమార్‌రెడ్డి, జంగం భాస్కర్, మార్క శ్రీనివాస్‌గౌడ్, సామ రాజు, ఓదెల నరేందర్, తోట శ్రీనివాస్, మారవేని వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి మండలంలో..

రామగిరి: మండలంలోని చందనాపూర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–04లో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ గంట పద్మ, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడి, ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు దామోదర్, రాజమల్లు, విజయ్‌కుమార్, కనకయ్య, తెలుగు రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ మోడల్ జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. 2025–26 సంవత్సరానికి ప్రవేశాల దరఖాస్తుల నమోదు 5 నుంచి 20 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ ప్రతీ గ్రూపులో 40 సీట్లు ఉన్నయని వివరించారు.

● కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని భూపతిపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోని సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) ఇంగ్లీష్ మీడియం కోర్సుల్లో ప్రవేశం పొందేవారు 5వ తేదీ నుంచి ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 వరకు దరఖాస్తులను విద్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 99634 71638 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

● ప్లకార్డులతో నిరసన

యైటింక్లయిన్‌కాలనీ: చేర్యాల మండలం వెదగిరి గ్రామానికి చెందిన అజయ్ అనే దళిత యువకుడిని ఈనెల3న కొంతమంది దూషిస్తూ, అతనిపై దాడికి పాల్పడ్డారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని భీమా కోరేగావ్ సేవా సంస్థ అధ్యక్షుడు ఇరికి మహేశ్ కోరారు. యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సంస్థ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. సంస్థ సభ్యులు సాగర్, సారయ్య, రాజేశ్వరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● విద్యుత్‌షాక్‌తో రెండు గేదెలు మృతి

మంథని: మంథని మండలం చిన్నఓదాల గ్రామ శివారులో మేతకు వెళ్లిన రెండు గేదెలు ఆదివారం మృత్యువాత పడ్డాయి. బాధిత రైతులు లెంకల చంద్రయ్య, సుంకరి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈదురుగాలులకు గ్రామ శివారులో విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. ఈ విషయం విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. మేతకు వెళ్లిన గేదెలు తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయని వారు వాపోయారు. ఒక్కో గేదె విలువ రూ.40వేలు ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని బాధితరులు కోరుతున్నారు.

● పర్సనల్ అధికారుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2లో పర్సనల్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, నాయకులు చెర్కు ప్రభాకర్‌రెడ్డి, ఐ.సత్యం కోరారు. ఖాళీల మూలంగా కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందలేదన్నారు. ఇద్దరు అధికారులు మాత్రమే ఉండటంతో వారిపై పనిభారం పెరుగుతోందన్నారు. ఇలాంటి ఒత్తిడి పరిస్థితుల్లోనే ఓసీపీ త్రీ వెల్ఫేర్ అధికారి రాజు గుండెపోటుతో చనిపోయాడన్నారు. పూర్తిస్థాయి అధికారులను వెంటనే నియమించాలని వారు డిమాండ్ చేశారు.


పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత



ప్రయాణికులకు బ్యాగ్ అందజేస్తున్న ఆటోడ్రైవర్

గోదావరిఖని: ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగ్‌ను ట్రాఫిక్ పోలీసుల జోక్యంతో బాధితులకు అందించారు. వివరాల్లోకి వెళ్తే ఆదివారం పెసరి సునీత దంపతులు రామగుండం రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో స్థానిక బస్టాండ్ వద్దకు వచ్చారు. ఆటోలోంచి దిగుతూ డబ్బులున్న బ్యాగ్ అందులో మర్చిపోయారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు తోటి సిబ్బందితో కలిసి సీసీపుటేజీలను సేకరించారు. దీంతో వారు దిగిన ఆటో నంబర్‌ను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. మర్చిపోయిన బ్యాగ్‌తో పాటు అందులో ఉన్న రూ.30వేలు బాధితులకు ఇప్పించారు. పోగొట్టుకున్న బ్యాగ్, అందులో ఉన్న నగదు ఇప్పించి ట్రాఫిక్ పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

గాలికి విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



ముత్తారం: మండలంలో ఆదివారం రాత్రి వీచిన గాలి దుమారానికి విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో మండలంలోని గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. మండలంలోని ఖమ్మంపల్లి, సీతంపేట, అడవిశ్రీరాంపూర్, ముత్తారం, పారుపల్లి, కేశనపల్లి, మైదంబండ, మచ్చుపేట తదితర గ్రామాల్లో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. గాలి దుమారంతో పాటు వర్షం పడటంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు కొట్టుకపోవడంతో రైతులు ఆగమయ్యారు. వడ్లు తడవకుండా రైతులు నానా తంటాలు పడ్డారు.

వైభవంగా గడప పెట్టే పూజా కార్యక్రమం



ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం గడప పెట్టే కార్యక్రమాన్ని వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముప్పిరితోట హనుమాన్ భక్త బృందం, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో డ్రైనేజీ.. నిలుస్తున్న మురుగు

రామగుండం: పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. తరచూ ప్రధాన రహదారిపైకి మురుగు నీరు పారడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భగీరథ పైపులైన్ సైతం అందులో నుంచే ఉండడంతో పలుచోట్ల ఉన్న వాల్వుల నుంచి మురుగు నీరు చేరి కలుషితమవుతున్నట్లు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన



వివరిస్తున్న అధ్యాపకులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రభుత్వ కళాశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని గోదావరిఖని ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు అన్నారు. కళాశాల అధ్యాపకులు యైటింక్లయిన్‌కాలనీ, సంతోష్‌నగర్, వెంకట్రావుపల్లి, కేకేనగర్, పోతనకాలనీ, తదితర ఏరియాల్లో పదో తరగతి పూర్తయిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, సెక్టార్–3 సింగరేణి పాఠశాల విద్యార్థులను ఆదివారం కలిశారు. కళాశాలల్లో నిర్వహిస్తున్న కోర్సుల గురించి వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు రాజ్యలక్ష్మి, కోమలత, కృష్ణవేణి, శంకర్, నరేశ్‌కుమార్ ఉన్నారు.



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ప్రయాణికుల కోసం నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ కొన్నినెలలు మాత్రమే ప్రజలకు ఉపయోగపడగా రెండేళ్లుగా మూసివేసి ఉంది. ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐతో పాటు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు బస్సుల్లో ఇక్కడి నుంచి వెళ్తారు. సులభ్ కాంపెక్స్ మూసి ఉండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

పోరాటాలతోనే హక్కులు సాధ్యం



మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని: పోరాటాలతోనే హక్కులు సాధ్యమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం రీజియన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం విలీనం తర్వాత నిర్వహించిన మొదటి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. మే 20న జరిగే సమ్మెను సింగరేణిలో విజయవంతం చేసేలా ప్రచారం చేయాలని కోరారు. అనంతరం రామగుండం రీజియన్, డివిజన్ల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. రామగుండం రీజియన్ అధ్యక్షుడిగా బి.అశోక్, ఉపాధ్యక్షుడిగా తొట్ల రాయమల్లు, కార్యదర్శిగా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చింతల శేఖర్, కోశాధికారిగా గుండేటి మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా ఎస్.ప్రసాద్, ఎస్ సీబాబు, పి.మొండయ్య, బి.కిరణ్, ఎ.చంద్రయ్య, దాసరి నర్సయ్య, తిరుపతి, ఎం.నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఆర్జీ–1 డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.ప్రసాద్, ఆర్జీ–2, 3 డివిజన్ కమిటీ అధ్యక్షులుగా తోట రాయమల్లును ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు నరేశ్, దుర్గం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో తాగునీటికి తిప్పలు



చేతి పంపు వద్ద స్థానికులు

ముత్తారం: మండల కేంద్రమైన ముత్తారంలోని ఒడ్డెర కాలనీలో మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తాగునీటి కోసం మహిళలు నానా తిప్పలు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొద్దంతా పనులకు వెళ్లి రాత్రివేళ తాగునీరు అవసరాల నిమిత్తం నీరు పట్టుకోవడానికి చేతి పంపు వద్ద వరుసలో నిలబడుతున్నారు. ఒకేసారి అధిక సంఖ్యలో చేతి పంపు వద్దకు చేరుకోవడంతో గొడవలు అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సమోసాలో పురుగు



కోల్‌సిటీ: ఒక బేకరీలోని బ్రెడ్‌లో సిల్వర్ కవర్, ఇంకొక బేకరీలో గడువు ముగిసిన రసాయనాలు ఉపయోగిస్తూ కేకుల తయారీ, మరొక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో నిల్వ చేసిన ఆహారం ఉపయోగించడం, ఇలాంటి ఘటనలు రోజుకొకటి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెలుగు చూస్తున్నాయి. ఇవి పొరపాటున పడుతున్నాయో.. లేదంటే రుచి కోసం వారే వేస్తున్నారో వడ్డిస్తున్న వారికే తెలియాలి. తాజాగా గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఓ బేకరీలో సమోసా తిందామనుకున్న పీక భారత్ అనే యువకుడికి చనిపోయిన పురుగు దర్శనమిచ్చిన సంఘటన వెలుగుచూసింది. ఖంగుతిన్న భరత్ ఈ ఘటనపై బేకరి షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. 'సారీ బ్రదర్.. వేరే సమోసా ఇస్తా తినండి' అంటూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు షాపు నిర్వాహకుడు. ఈ ఘటనపై నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. సంబంధిత అధికారులు తనిఖీ చేసి కలుషిత ఆహార పదార్థాలు విక్రయిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యయనోత్సవం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమదఖిలాండకోటబ్రహ్మాండ నాయకుడగు శ్రీమదలమేల్మంగా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి తిరుక్కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో అధ్యయనోత్సవం, ఆరంభం, తొళ్ళుక్కం–దివ్యప్రబంధ సేవాకాలం, తీర్థప్రసాద వినియోగం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భాగవతచరణరేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మారం: మండల కేంద్రంలోని సంజీవని ఆసుపత్రిలో ఆదివారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో గుండె సంబంధిత పరీక్షలు 2డి ఎకో, ఈసీజీతో పాటు కడుపునొప్పి, పైల్స్, అపెండిక్స్ బీపీ, షుగర్‌కు గుండె వైద్య నిపుణులు డాక్టర్ అనీష్ పబ్బ జనరల్ సర్జన్ డాక్టర్ రాజేశ్‌కుమార్, డాక్టర్ ప్రశాంత్ వైద్య పరీక్షలు నిర్వహించారు.